మెగా వాలీబాల్ టోర్నమెంట్

ఎదులాపురం, సెప్టెంబర్ 24 : పోలీసుల ఆధ్వర్యంలో మెగా వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభిస్తామని ఆదిలాబాద్ ఎస్పీ గౌష్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేదీన గుడిహత్నూర్ మండలం మోడల్ స్కూల్‌లో ఉదయం 8 గంటలకు మెగా వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. యువత ప్రతి గ్రామం నుంచి జట్టుల వారీగా ఈ టోర్నమెంట్ నందు పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు ఇచ్చోడ సీఐ 8712659936, గుడిహత్నూర్ ఎస్ఐ 8712659946, నేరడిగొండ ఎస్ఐ 8712659947, సిరికొండ ఎస్ఐ 8712659948లను ఈ నెల 26వ తేదీ సాయంత్రం 6 గంటల లోపు సంప్రదించాలని సూచించారు. ఈ టోర్నమెంట్ ఈ నెల 27, 28, 29 తేదీల్లో నిర్వహించబడుతుందని తెలిపారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి

ఎదులాపురం, సెప్టెంబర్ 24 : భగత్‌సింగ్ నగర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం సీనియర్ నాయకుడు బండి దత్తాత్రి అన్నారు. మంగళవారం భగత్‌సింగ్ నగర్ శాఖ మహాసభలను కాలనీలో నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను సీనియర్ నాయకుడు ఎగురవేశారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్, సీనియర్ నాయకుడు బండి దత్తాత్రి మాట్లాడుతూ బీజేపీ, ఎంఐఎం పార్టీలు మత రాజకీయాలు చేస్తూ ఐక్యంగా ఉన్న ప్రజలను చీల్చే కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఈ రెండు పార్టీలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హితవుపలికారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఆర్ మంజుల, శాఖ కార్యదర్శి పోసాని, నాయకులు ప్రభు, రేణుక, ఉస్మాన్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బోథ్, సెప్టెంబర్ 24 : సొనాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ మైనార్టీ నాయకుడు అల్లా బకాశ్ ఇటీవలే మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను మంగళవారం కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ పరామర్శించారు. ఆయన వెంట పట్టణాధ్యక్షుడు చెట్లపెల్లి అనిల్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బత్తుల రమేశ్, సీనియర్ నాయకులు గాజుల పోతన్న, అమృత్‌రావ్ పాటిల్, యూత్ అసెంబ్లీ అధ్యక్షుడు పోతారెడ్డి ఉన్నారు.

దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు చర్యలు

నార్నూర్, సెప్టెంబర్ 24 : దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని వైద్యాధికారులు రాంబాబు, జితేందర్‌రెడ్డి అన్నారు. ఎంపల్లి గ్రామంలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. 50మందికి వైద్య పరీక్షలు చేసి రక్తనమూనాలు సేకరించారు. కార్యక్రమంలో హెచ్ఈవో తులసీదాస్, ఆరోగ్య పర్యవేక్షకుడు చరణ్ దాస్, వైద్య సిబ్బంది, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

General public are hereby informed that my client M/S. Shriram Finance Pvt. Ltd. Nirmal agreed to accord loan to Sri. Kallem Thirupathi S/o. K. Durgaiah, age 41 years, Occ: Business, R/o.H.No.8-98, Gosampally Village, Mandal Khanapur, Nirmal District, Telangana State by mortgage of the schedule referred property. The above prospective loanee agreed to create first charge against schedule property. mentioned below in favour of my clients company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **7 days** of this notice. The objections are raised afterwards shall be deemed to be "waived" and not binding on my clients company and my clients shall proceed further for according above loan by mortgage of the schedule property. Hence this notice.

SCHEDULE PROPERTIES

The plot No.03. lies in Survey No. 158 extent 33'x50'=1650.00 Sq.fts = 183.33 Square yards = 153.28 Sq.mtrs, situated at Thimmapur village of Khanapur Mandal and Municipality Nirmal District Telangana State. North: Plot No.02, South: Plot No.4, East: 16' Wide Road, West: Plot No.08. The plot No. 1/1, lies in survey No.370/^A/1/1, extent 1303.12 Sq. fts= 144.79 square yards= 121.05 sq.mtrs, situated at Maskapur Village of Khanapur Mandal, Grampanchayathi, Nirmal District, Telangana State. **North:** Open Place of others, **South:** Plot No.1, **East :** Open Place of L.Rajanna, **West :** 25' wide Road,

Sd/- DR.S.LINGAIAH, Advocate
Nirmal Town, Nirmal, Cell: 9912604136

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

- బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

తాంసి, సెప్టెంబర్ 24 : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. మంగళవారం తాంసి మండలం కప్పర్ల గ్రామంలో దాతల సహకారంతో యువకులు నిర్మించిన గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పట్టుదలతో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. గ్రంథాలయానికి పుస్తకాలతో పాటు తగు సౌకర్యాలను యువకులు ఏర్పాటు చేసుకోవడంతో వారిని అభినందించారు. తనవంతుగా కావాల్సిన పుస్తకాలు అందిస్తానని తెలిపారు. ఎమ్మెల్యేను యువకులు పంచాయతీ కార్యదర్శితో కలిసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కౌడాల మహేందర్, కిరణ్ కుమార్, వినోద్ రెడ్డి, హరి వర్ధన్, రమణ, అశోక్ పాల్గొన్నారు.

తాంసి: ఎమ్మెల్యేను సన్మానిస్తున్న యువకులు

కొంచావాలి దర్గాలో ప్రార్థనలు

తాంసి(భీంపూర్), సెప్టెంబర్ 24 : భీంపూర్ మండలం అర్లి(టీ) గ్రామ శివారులోని గుట్టపైన ప్రతి ఏటా పోలాల అమావాస్య తర్వాత వచ్చే మొదటి మంగళవారం కొంచావాలి దర్గాలో పూజలు చేసి జాతర నిర్వహిస్తారు. ఈ సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ కాలి నడకన దర్గా వద్దకు చేరుకొని చాదర్ సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్గా వద్ద కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సుధాకర్, బీఆర్ఎస్ నాయకులు సంజీవ్ రెడ్డి, సంతోష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అవ్వకు అండగా ఎమ్మెల్యే

భీంపూర్ మండలం అర్లి గ్రామ శివారులో జరిగిన కొంచావాలి దర్గా జాతరకు హాజరైన అవ్వ స్పృహ తప్పి కూర్చోవడంతో అటుగా వచ్చిన బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ గమనించారు. అవ్వతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. నడవలేకపోతున్న అని అవ్వ తెలుపగా బైక్ సహాయంతో గ్రామానికి చేర్చారు. దీంతో అవ్వ సల్లంగా ఉండాలి.. ఎమ్మెల్యే సార్ అని దీవించింది.

రైతులందరికీ రుణమాఫీ అందేలా చూడాలి..

రైతులందరికీ రుణమాఫీ అందేలా చూడాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. భీంపూర్‌లోని జిల్లా కో ఆపరేటివ్ సహకార బ్యాంకును సందర్శించారు. బ్యాంకులో రుణాలు పొందిన వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రుణమాఫీ జరగని రైతుల వివరాలు పూర్తిగా ప్రభుత్వానికి అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

తలమడుగు, సెప్టెంబర్ 24: తలమడుగు మండలం ఖోడద్ గ్రామానికి చెందిన ఎల్మా రుతుజా రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పరామర్శించారు. ఆయన వెంట బోథ్ మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

యోగా శిక్షకుల నియామకానికి ఇంటర్వ్యూలు

ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

ఎదులాపురం, సెప్టెంబర్ 24 : ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆవరణలో గల ఆయుష్ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన యోగా శిక్షకుల నియామక ఇంటర్వ్యూలకు అనూహ్య స్పందన లభించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 41 వెల్‌నెస్ సెంటర్లలో యోగా శిక్షకులను నియమించుటకు నిర్వహించిన ఇంటర్వ్యూలకు వివిధ ప్రాంతాల నుంచి అభ్యర్థులు తరలివచ్చారు. వరంగల్ ఆర్డీ డాక్టర్ ప్రమీల దేవి, అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ పరమేశ్వర్లు హాజరై అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించి యోగాసనాలు వేయించి పలు ప్రశ్నలు అడిగారు. ఇదిలా ఉండగా..ఇంటర్వ్యూలు సరిగా పారదర్శకంగా జరగలేదని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ పాల్గొన్నారు.

కారు ద్విచక్రవాహనం ఢీ : ఒకరికి గాయాలు

లక్ష్మణచాంద, సెప్టెంబర్ 24: మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామంలోని ఎక్స్ రోడ్డు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ సుమలత వివరాల ప్రకారం... నిర్మల్‌కు చెందిన దేగం మధుకర్ మంగళవారం కారులో నిర్మల్ నుంచి మామడ వైపు వెళ్తున్నాడు. నర్సాపూర్(డబ్ల్యూ) చెక్‌పోస్ట్ వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న మోటర్ సైకిల్‌ను అతివేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహన చోదకుడు మారుతి జంగ్లేకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. గాయాలైన మారుతిని నిర్మల్‌లోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రేమను నిరాకరించారని ఆత్మహత్యాయత్నం

ఉట్నూర్ రూరల్, సెప్టెంబర్ 24 : ఉట్నూర్ మండలం కన్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రాంజీగూడలో తమ ప్రేమను పెద్దలు నిరాకరిస్తారని ప్రేమజంట ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ మనోహర్ వివరాల ప్రకారం.. రాంజీగూడ గ్రామానికి చెందిన ఆత్రం తుకారాం విజ్జుబాయిలకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు సంతానం. తుకారాం నాలుగేళ్ల క్రితం మృతి చెందగా పెద్ద కొడుకు ఆత్రం హన్మంతరావ్(22) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ తరుణంలో నార్నూర్ మండలం బొడ్డిగూడ గ్రామానికి చెందిన ఓ యువతితో పరిచయమై ప్రేమగా మారింది. వారి ప్రేమను పెద్దలు అంగీకరించరని పంట చేనుకు వెళ్లి ఇద్దరు కలిసి పురుగుల మందు తాగారు. హన్మంత్‌రావ్ చేనుకు వెళ్లి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామస్తుల సహాయంతో పంట చేనులో వెతికారు. ఇద్దరు స్పృహ తప్పి పడిపోయి ఉన్నారు. వెంటనే అంబులెన్స్‌లో ప్రభుత్వ దవాఖానకు తరలించేలోపు హన్మంత్‌రావ్ సోమవారం రాత్రి మృతి చెందగా యువతిని మెరుగైన చికిత్స నిమిత్తం కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉంది. మృతుడి తల్లి విజ్జుబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

సోన్, సెప్టెంబర్ 24 : నిర్మల్ మండలం అనంతపేట్ గ్రామానికి చెందిన పోలీస్ భూమన్న (41) గ్రామ శివారులోని చెట్టుకు మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు నిర్మల్ రూరల్ ఎస్ఐ లింబాద్రి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం... పోలీస్ భూమన్న తన ఇంటి నుంచి పొలంలో యూరియా చల్లి వస్తానని చెప్పి వెళ్లి సమీప బంధువుకు ఫోన్ చేసి తాను చనిపోతున్నానని చెప్పాడు. భూమన్న ఇదివరకే పలుమార్లు ఇలాగే చెప్పాడని పట్టించుకోలేదు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో చుట్టూ పక్కల వెతికారు. చివరకు మామిడితోటలో ఓ చెట్టుకు ఉరివేసుకుని కనిపించాడు. భూమన్న పెద్ద కుమారుడు గతంలో ఓ బిల్డింగ్‌పై నుంచి పడిపోయి చికిత్స నిమిత్తం అప్పులు చేయడంతో అవి ఎలా తీర్చాలో బాధపడుతూ మనస్థాపం చెంది మద్యం మత్తులో ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ముస్లిం పెద్దలతో ప్రభుత్వం చర్చలు

ఖానాపూర్, సెప్టెంబర్ 24 : జైనూర్‌లో జరిగిన ఘటన నేపథ్యంలో స్థానిక ఆదివాసీ, మైనార్టీ వర్గాల మధ్య సయోధ్య కుదుర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం వరస భేటీలు నిర్వహిస్తున్నది. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల చారి సమావేశమయ్యారు. రెండు వర్గాల మధ్య నెల కొన్న అప నమ్మకాన్ని పోగొట్టేలా ఇరుపక్షాల పెద్దలతో త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ స్పష్టం చేసినట్లు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ పీఏ 'నమస్తే తెలంగాణ'కు ఫోన్‌లో తెలిపారు. ఆదివాసీ ప్రాంతాల్లో అభివృద్ధి, శాంతిని నెలకొల్పడంలో మైనార్టీ నాయకులు సహకరించాలని ఎమ్మెల్యే కోరినట్లు వివరించారు.

కుష్టు రహిత సమాజానికి కృషి చేయాలి

బజార్‌హత్నూర్, సెప్టెంబర్ 24: కుష్టు రహిత సమాజం కోసం వైద్య సిబ్బందితో పాటు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర కుష్టు వ్యాధి నివారణ బృందం సభ్యులు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వారు సందర్శించారు. వైద్య సిబ్బందికి కుష్టు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం దవాఖానలోని పలు రికార్డులు పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కుష్టు వ్యాధి నివారణ బృందం సభ్యులు జాన్ బాబు, శ్రీనివాస్, సర్వేశ్వర్, స్థానిక వైద్యాధికారి భీంరావ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధికి తన వంతు కృషి

ఎదులాపురం, సెప్టెంబర్ 24 : మాల సమాజ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మాల సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు అల్లూరి భూమన్న అన్నారు. సంఘం ఎన్నికల ప్రక్రియలో భాగంగా మంగళవారం నామినేషన్ వేసేందుకు కలెక్టర్ చౌరస్తా నుంచి ర్యాలీగా వెళ్లారు. ఎన్టీఆర్ చౌక్ మీదుగా బస్టాండు సమీపంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి సంఘ భవనానికి వెళ్లి నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా అల్లూరి భూమన్న మాట్లాడుతూ అక్టోబర్ 8న అధ్యక్ష పదవితో పాటు ఇతర కార్యవర్గానికి ఎన్నికలు జరుగుతాయని, ప్రతి మాల సోదరుడు పాల్గొనాలని కోరారు.

సాత్నాల ప్రాజెక్టు గేటు ఎత్తివేత

జైనథ్, సెప్టెంబర్ 24 : ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షానికి భారీగా వరద సాత్నాల ప్రాజెక్టులోకి చేరింది. ప్రాజెక్టులోని నాలుగు గేట్లలో సోమవారం అర్ధరాత్రి ఒక గేటును ఎత్తివేసి వరద దిగువ ప్రాంతానికి అధికారులు వదిలారు. ప్రాజెక్టు గరిష్ఠ సామర్థ్యం 268.50 అడుగులు కాగా ప్రాజెక్టు సామర్థ్యం 1.24 టీఎంసీలు కాగా 1.159 టీఎంసీలుగా ఉంది. ప్రాజెక్టు ఇన్ ఫ్లో 300 క్యూసెక్కులు కాగా ఔట్ ఫ్లో 400 క్యూసెక్కులుగా ఉంది. ప్రాజెక్టు పరిస్థితిని ఎప్పటికప్పుడు సాత్నాల ప్రాజెక్టు డీఈ శ్రీనివాస్ రావ్, ఏఈ మారుతి పర్యవేక్షిస్తున్నారు.

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

తాంసి, సెప్టెంబర్ 24: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ద్వారా అందిస్తున్న రుణాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో అడ్డి భోజారెడ్డి అధ్యక్షతన వ్యవసాయ సహకార సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల రైతులకు గృహ రుణాలు, వ్యవసాయాన్ని కావాల్సిన యంత్రాల రుణాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులు, పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో ప్రాథమిక సహకార సంఘం సీఈవో కేశవ్, వైస్ చైర్మన్ ధనుంజయ్, డైరెక్టర్లు రమేశ్, సంతోష్ రెడ్డి, చంద్రన్న, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ భూముల పరిశీలన

సోన్, సెప్టెంబర్ 24: కడ్తాల్ గ్రామంలో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 208, 209, 210, 212 సర్వే నంబర్‌లో అప్పటి ప్రభుత్వం 1998లో 70 ఎకరాల భూమిని అర్హులైన పేదలకు కేటాయించింది. 15 సంవత్సరాల పాటు వ్యవసాయం చేయగా పేదల నుంచి ఓ రియాల్టర్ తక్కువ ధరకు భూములను కొనుగోలు చేసి అక్రమ లేఅవుట్లు వేసి విక్రయిస్తున్నారు. దీనిపై ఇటీవల గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా మంగళవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రఫిక్, సిబ్బందితో కలిసి ఆ భూములను పరిశీలించారు. నివేదికను పై అధికారులకు పంపనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీఓ కలీం, గ్రామస్తులు పుట్టి సాయిరాం, సుధీర్, సాయన్న, గంగన్న, చిన్నయ్య, బర్మ నర్సయ్య, వెన్నెల శ్రీనివాస్, బర్మ రాజు, నితీశ్, చింతల ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి సుమయ్య, ఉన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అందజేత

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 24: నిర్మల్ జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న, దొంగలించబడిన 65 సెల్‌ఫోన్లను సీఈఐఆర్ సాంకేతికతో స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం బాధితులకు నిర్మల్ ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల సెల్‌ఫోన్లను అందజేశారు.

30న పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభ

నిర్మల్ అర్బన్, సెప్టెంబర్ 24 : హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఈ నెల 30వ తేదీన నిర్వహించే పీడీఎస్‌యూ స్వర్ణోత్సవ సభను జయప్రదం చేయాలని పూర్వ పీడీఎస్‌యూ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కట్ల రాజన్న పిలుపునిచ్చారు. మంగళవారం నిర్మల్‌లో స్వర్ణోత్సవ సభకు సంబంధించిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభకు జిల్లాలోని ప్రజలు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మహేందర్, నాయకులు స్నేహ, అశ్విని, జ్యోతి, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడికి సన్మానం

ఇచ్చోడ, సెప్టెంబర్ 24 : ప్రభుత్వ జూనియర్ కళాశాలల లెక్చరర్ల సంఘం ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా ఇచ్చోడ జూనియర్ కళాశాల హిందీ అధ్యాపకుడు హింగోలి సత్యనారాయణ రావ్ ఎన్నికయ్యారు. మంగళవారం ఆయనను ప్రిన్సిపాల్ బీ శంకర్, అధ్యాపక బృందం సభ్యులు సన్మానించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు సత్యనారాయణరావ్, ప్రభాకర్ రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల సందర్శన

తానూర్, సెప్టెంబర్, 24 : తానూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం జిల్లా ఇంటర్ మాధ్యమిక విద్యాధికారి పరశురాం సందర్శించారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరు శాతం పెంచాలని అధ్యాపకులకు సూచించారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్, అధ్యాపకులు ఉన్నారు.

బహిరంగ సభకు తరలిన రేషన్ డీలర్లు

ఖానాపూర్, సెప్టెంబర్ 24: రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరుగనున్న భారీ బహిరంగ సభకు ఖానాపూర్ మండల రేషన్ డీలర్లు మంగళవారం పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. వెళ్లిన వారిలో డీలర్ల సంఘం నాయకులు సురేశ్, రాజేందర్ తదితరులు ఉన్నారు.

రేషన్ డీలర్లు అరెస్టు

భైంసా, సెప్టెంబర్ 24 : భైంసాలో మంగళవారం రేషన్ డీలర్లను పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ పటాన్ చెరువు జీఎంఆర్ గార్డెన్‌లో నిర్వహించే చలో హైదరాబాద్ బహిరంగ సభకు బయలుదేరగా అడ్డుకొని పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని వెళ్తున్న తమను అరెస్టు చేయడం సరికాదని అన్నారు. రేషన్ డీలర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

మూడు పేకాట స్థావరాలపై దాడి

జైనథ్, సెప్టెంబర్ 24: మండలంలోని ఆనంద్‌పూర్, కూర, దీపాయిగూడ గ్రామాల్లో పేకాటాడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ పురుషోత్తం సిబ్బందితో కలిసి దాడి చేశారు. పేకాటాడుతున్న ఆనంద్‌పూర్‌కు చెందిన ఏడుగురిని, కూరకు చెందిన ఆరుగురిని, దీపాయిగూడకు చెందిన ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 52 పేక ముక్కలు, నగదు రూ.18,980 సీజ్ చేశామని తెలిపారు. ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ శిక్షణ ప్రారంభం

ఎదులాపురం, సెప్టెంబర్ 24 : రిమ్స్‌లోని బోధన సిబ్బందికి మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్ శిక్షణ తరగతులు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఎన్ఎంసీ నిబంధనల మేరకు విద్యార్థులకు బోధన చేయడానికి మూడు రోజుల శిక్షణ తరగతులు రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ ప్రారంభించారు.

నిబంధనలు పాటిస్తూ వైద్య సేవలందించాలి

విద్యార్థులతో మాట్లాడుతున్న బాసర జోన్ ప్రత్యేకాధికారి డాక్టర్ జాన్‌బాబు

ఎదులాపురం, సెప్టెంబర్ 24 : ప్రైవేట్ దవాఖానల్లో పూర్తి నిబంధనలు పాటిస్తూ వైద్య సేవలందించాలని సంయుక్త సంచాలకుడు (డైరెక్టర్ ఆఫ్ హెల్త్) బాసర జోన్ ప్రత్యేక అధికారి డాక్టర్ జాన్‌బాబు అన్నారు. ఆదిలాబాద్‌లో మంగళవారం రెండో రోజు సైతం ప్రైవేట్ దవాఖానల్లో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ అమలు తీరుతో పాటు ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం బస్టాండ్ పక్కన ఉన్న బీఎస్ఆర్ పారామెడికల్ కళాశాలను తనిఖీ చేశారు. తరగతి గదిలోని విద్యార్థులను పలు ప్రశ్నలు అడగగా సమాధానాలు రాకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. రిజిస్టర్‌లో పేర్లు ఉన్నవారు ఇక్కడ లేరు. ఉన్న తొమ్మిది మంది విద్యార్థులకు ఏ కాస్లు కొనసాగుతున్నాయి? ఎన్ని సబ్జెట్లు ఉన్నాయని డాక్టర్ జాన్‌బాబు విద్యార్థులను ప్రశ్నించారు. అక్కడ ఉన్న విద్యార్థులు పేర్లను నమోదు చేసుకున్నారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి వసతులు, బోధన తదితర అంశాలను తెలుసుకున్నారు. మళ్ళీ వస్తా...వచ్చే సమయంలో అన్ని సక్రమంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీలో పీడీఎంవో శ్రీనివాస్ రెడ్డి, హెచ్ఓ వెంకటేశ్వర్ రెడ్డి, పీవో డీటీటీ డాక్టర్ రాథోడ్ నరేందర్, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ గజానంద్ ఉన్నారు.

పిడుగుపాటుకు ఎడ్లు, లేగదూడ మృతి

లోకేశ్వరం, సెప్టెంబర్ 24: లోకేశ్వరం మండలంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో పాటు పిడుగుపడడంతో రాయపూర్ కాండ్లి గ్రామంలో మక్కాజి లింగురాం అనే రైతుకు చెందిన రెండు ఎడ్లు, ఒక లేగ దూడ మృతి చెందాయి. రైతు లింగురాం చేనులో పనికి చేదోడు వాదోడుగా ఉండే ఎడ్లు మృతి చెందడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారు. వీటి విలువ రూ.2.50 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

జీవిత బీమా చెక్కు అందజేత

భైంసా, సెప్టెంబర్ 24 : భైంసాలోని ప్రాథమిక సహకార సంఘాలలో స్వల్పకాలిక రుణాలు పొందిన దేగాం గ్రామానికి చెందిన ప్రభాకర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. రైతు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మిర్జాపూర్ నందు క్రాప్‌లోన్ తీసుకున్న సమయంలో ప్యాక్స్ బీమా తీసుకున్నాడు. బీమా కంపెనీ ద్వారా వచ్చిన రూ.2 లక్షల చెక్కును మంగళవారం మృతుని భార్య రత్నకు సొసైటీ చైర్మన్ అమెడ దేవేందర్ రెడ్డి అందజేశారు. ఇందులో డైరెక్టర్లు శ్రీనివాస్, చంద్రకాంత్ రెడ్డి, కారిగిరి సాయినాథ్, వై శ్రీనివాస్, బ్యాంకు సూపర్‌వైజర్ అభిలాష్ గౌడ్, సెక్రటరీ రాజేందర్, సిబ్బంది శ్రావణ్, సురేశ్ పాల్గొన్నారు.

ఇంటి తాళం పగలగొట్టి చోరీ

భైంసా, సెప్టెంబర్ 24: భైంసాలోని ద్వారకానగర్‌లో ఓ ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. బాధితుడి కథనం ప్రకారం.. భట్టిగల్లికి చెందిన రాధాకిషన్ ద్వారకానగర్‌లోని సంపత్‌కుమార్ వద్ద పని చేస్తున్నాడు. సంపత్ కుమార్ పని నిమిత్తం ఇతర ప్రాంతానికి వెళ్లగా రాధాకిషన్ సోమవారం రాత్రి ఇంటికి తాళం వేసి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చి చూడగా ఇంటి తలుపు తాళం పగలగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా ఎల్ఈడీ టీవీ, హోంథియేటర్, రైస్ కుక్కర్ చోరీకి గురైనట్లు గుర్తించాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నాడు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

సోన్, సెప్టెంబర్ 24: సోన్ మండలం బొప్పారం గ్రామానికి చెందిన కుంచపు లక్ష్మి (46) విద్యుత్ షాక్‌తో మంగళవారం మృతి చెందినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. లక్ష్మి బీరువా తాళం ఇనుప కూలర్‌పై ఉందని దానిని తీయడానికి వెళ్లగా ప్రమాదవశాత్తు షాక్ తగలి అక్కడనే పడిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన నిర్మల్‌లోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తప్పిన ప్రమాదం

గుడిహత్నూర్, సెప్టెంబర్ 24 : గుడిహత్నూర్‌లోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో మంగళవారం ఉదయం తృటిలో ఘోర ప్రమాదం తప్పింది. సంఘటన వివరాలు.. నిర్మల్ వైపు నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న కంటైనర్(లారీ) వెళ్తున్న క్రమంలో గుడిహత్నూర్ వద్ద ముందు టైర్ బ్లాస్ట్ కావడంతో అదుపు తప్పి డివైడర్‌పై నుంచి ఆర్టీసీ బస్టాండ్ వైపు దూసుకెళ్లింది. ఆ ప్రదేశంలోనే కూరగాయల, ఇతర చిల్లర దుకాణాలు ఉన్నాయి. తెల్లవారు జామున ఈ సంఘటన జరగడంతో ఎవరు అక్కడ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

ఎద్దుల దొంగ అరెస్టు

భైంసా, సెప్టెంబర్ 24 : భైంసాలోని గోశాలలో రెండు ఎద్దులను దొంగలించిన వ్యక్తిని మంగళవారం పోలీసులు పట్టుకున్నట్లు పట్టణ సీఐ రాజారెడ్డి తెలిపారు. గోశాల నుంచి ఎద్దులను సిద్ధార్థ నగర్‌కు చెందిన దగ్డే మైసాజీ దొంగతనం చేసి తీసుకెళ్లి వాటిని వారసంతలో అమ్ముతుండగా పోలీసులు పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

రోడ్డుపై బైఠాయించి ఇబ్బందులు గురి చేసిన వారిపై కేసు నమోదు

ఎదులాపురం, సెప్టెంబర్ 24: నార్నూర్ మండలం చోర్‌గావ్‌కు చెందిన విద్యార్థి రాథోడ్ జితేందర్(20)ను పురుగుల మందు తాగించి మరణానికి కారణమైన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఈ నెల 21న ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు నిరసిస్తూ బస్టాండ్ ఎదుట ఆందోళన చేసిన విషయం తెలిసిందే. జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున పోలీసుల విధులకు అడ్డుపడి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేసి రోడ్డుపై బైఠాయించారు. ఆందోళన చేసిన 13 మందితోపాటు మరికొందరిపై ఎస్ఐ విష్ణు ప్రకాశ్ కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ సీఐ సీహెచ్ కరుణాకర్ రావ్ తెలిపారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం

బోథ్, సెప్టెంబర్ 24 : బోథ్‌లోని వాగ్దేవి జూనియర్, డిగ్రీ, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మంగళవారం జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాళ్లు ప్రవీణ్ రెడ్డి, విఠల్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యాభ్యాసన సమయంలోనే సేవా భావాన్ని అలవర్చుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో ఉండి గ్రామాల్లో పర్యటించి వారి స్థితిగతులను తెలుసుకోవాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బోనగిరి కార్తీక్ మాట్లాడుతూ జాతీయ సేవా పథకంలో భాగంగా చేపట్టబోయే కార్యక్రమాలను వివరించారు. గ్రామాలను దత్తత తీసుకుని అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు దీప, సీనియర్ అధ్యాపకులు ముత్యం, సతీశ్, రాజేశ్వర్, ప్రసాద్, మహేశ్, హరీశ్, దత్తు, పండరి మల్లిక, విద్యార్థులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

నార్నూర్, సెప్టెంబర్ 24: విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండాలని జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారి బాలాజీ కాంబ్లే పేర్కొన్నారు. నార్నూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్)దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఉదయ్‌కుమార్, వెంకటరమణ, నరేశ్, సుజాత, పుష్ప, సిబ్బంది గజానంద్, కృష్ణవేణి, రుక్మిణి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎదులాపురం, సెప్టెంబర్ 24 : ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ ఆర్ట్స్ కామర్స్ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాలలో పరిసరాలను శుభ్రపరిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అతిక్ బేగం, ఎన్ఎస్ఎస్ అధికారులు , బోధన బోధనేతర, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

భైంసా, సెప్టెంబర్, 24 : పట్టణంలోని గోపాల్ రావు పటేల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బుచ్చయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రాజు, వైస్ ప్రిన్సిపల్ రఘునాథ్, భీంరావు, పవన్ కుమార్, రవి కుమార్, శంకర్, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

బాసర, సెప్టెంబరు 24 : బాసర ఆర్జీయూకేటీలో సోమవారం ఎన్ఎస్ఎస్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్ఎస్ఎస్ జెండా ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ వెంకటరమణ మాట్లాడుతూ జాతీయ సేవా పథకం ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు జరుగుతున్నాయని, విద్యార్థులు విద్యతో పాటు సేవలో కూడా పాల్గొనలన్నారు. అనంతరం యోగా, ప్లాస్టిక్ వ్యర్థాల అవగాహనపై హ్యూమన్‌చైన్, సామాజిక గీతాలతో ప్లాష్‌మాబ్ కార్యక్రమం కొనసాగింది. అనంతరం ట్రిపుల్‌ఐటీ పురోగతిపై వీసీ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. పలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణదీర్ సాగి, తదితరులు పాల్గొన్నారు.

జాగృతి ప్రధాన కార్యదర్శి మృతి

గోలి శంకర్(ఫైల్)

ఎదులాపురం, సెప్టెంబర్ 24 : భారత జాగృతి జిల్లా ప్రధాన కార్యదర్శి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గోలి శంకర్(42) తనువు చలించారు. అనారోగ్య కారణాలతో మంగళవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. బీఆర్ఎస్ పార్టీకి సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఆయన మరణం పార్టీకి తీరని లోటని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆయన మృతి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

అక్రమ మొరం తరలించిన వ్యక్తికి జరిమానా

ఖానాపూర్ రూరల్, సెప్టెంబర్ 24 : ఖానాపూర్ మండలం బీర్నంది గ్రామంలో అక్రమ మొరం తరలించినందుకు ఓ వ్యక్తికి రూ.20 వేలు జరిమానా విధించినట్లు ఎఫ్ఆర్వో కిరణ్ తెలిపారు. గత నెల 17వ తేదీన బీర్నంది గ్రామంలోని అటవీ ప్రాంతంలో బుచ్చమల్లు అనే వ్యక్తి అక్రమంగా మొరం తవ్వకాలకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న అటవీ శాఖ సిబ్బంది సంబంధిత బ్లేడ్ ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. మంగళవారం రోజున రూ.20 వేలు జరిమానా విధించి విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

మున్నూరు కాపు సంఘ భవనానికి రూ.10 లక్షలు మంజూరు

బోథ్, సెప్టెంబర్ 24 : సొనాల గ్రామ మున్నూరు కాపు సంఘ భవన నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరైనట్లు మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం నిధుల మంజూరు ప్రొసీడింగ్ కాపీని సంఘం బాధ్యులకు అందజేశారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర ఈ నిధులు మంజూరు చేసినట్లు మాజీ ఎంపీపీ పేర్కొన్నారు. భవనంపై అంతస్తు నిర్మాణ పనుల కోసం ఈ నిధులు వెచ్చించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

ఇచ్చోడ తహసీల్దార్‌గా సత్యనారాయణ రావ్

ఇచ్చోడ, సెప్టెంబర్ 24 : ఇచ్చోడ తహసీల్దార్‌గా సత్యనారాయణరావ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ తుకారాం సిరికొండకు బదిలీ కాగా భీంపూర్‌లో తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన సత్యనారాయణరావ్ ఇచ్చోడకు వచ్చారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆహ్వానించారు.

బైక్ చోరీ

భైంసా, సెప్టెంబర్ 24: భైంసాలోని రాంనగర్‌లో ఓ ఇంటి ముందు నిలిపి ఉంచిన బైక్ చోరీకి గురైంది. బాధితుడి వివరాల ప్రకారం..మున్సిపాలిటీలో కార్మికుడిగా పని చేసే నర్సయ్య సోమవా రం రాత్రి తన ఇంటి ఎదుట బైక్ నిలిపి ఉంచగా ఉదయం లేచి చూసే సరికి కనిపించలే దు. మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు.